ఏవండోయ్! యిది వినరూ? ఆ నవల తరువాత చదువుదురుగాని......

నేను—అలా విండానికి వీల్లేదు. ఆనక చెపుదుగానిలే, చెప్పవలసిన మాటుంటే అంతేకాని యిప్పుడు మాట్లాడించకు.

మా. అ—మీకెంత తోస్తే అంతే అన్నమాట. అంతేగాని నేచెప్పబోయేమాట వినడం, దానికి జవాబు చెప్పడం ఏవీ లేదు...

సమయాసమయాలు కనిపెట్టి మాట్లాడుతూ వుండాలి అంతేగాని అస్తమానూ నోట్లోమాట జారబెట్టకూడదు, ఎందుకయినా మంచిదే.

పోనీ, మీరు చదువుకుంటూనే సమాధానం చెప్పరాదూ?......

అయితే అష్టావధానం చెయ్యమంటావా?

అష్టావధానం చెయ్యవద్దు దశావధానం చెయ్యవద్దు నే నడిగే మాటకి సమాధానం చెప్తారా? చెప్పరా? ఖరాఖండీగా ఏదోవొకటి చెప్పండి.... .....

అప్పుడే కోపం వచ్చిందనుకుంటాను. దెబ్బలాడి యింట్లోంచి లేచిపోవుగదా? కొంపదీసి కలకాలం బ్రతికే బ్రతుకు చెడిపోతుంది కూడాను. నూరుగొడ్లను తిన్నా రాంబొందు ఒక గాలిపెట్టన్నట్టు. వీధిలో రంకెలేసి మీసాలు దువ్వే మొగజనాభా ఇల్లే లొంగిపోతుంది ఆడప్రపంచకానికి అదేం పాపమోకాని ఆడాళ్ళవంక చూడ్డంతోటే ఆలోచనలు మారిపోతాయి. వాళ్ళదగ్గిర ఏవిధమయిన ఆకర్షణశక్తి వుంటుందో కాని పిడుగంటిమనిషినయినా సరే పీనుగుని చేసి వదలేస్తారు. మనబ్బాయి వేమగంటి పిల్లాడుగదా రాజ్యం అన్నా పిల్లని చూసేకా పచ్చిమంచినీళ్ళయినా నోట బొయ్యలేదు. ఆ పిల్లకోసరం బెంగెట్టుకొని పిల్లాడు పీలయిపోయాడు చూశావా? మళ్ళీ పిల్లాడు పూనుకోవడానికి కారణం ఆ పిల్లని పెళ్ళి చెయ్యబట్టేగదా. ఆడాళ్ళలో భగవంతుడు బహుశ (Magnet) వంటి పదార్థం ఏదో పడేసుండాలి మొగాళ్ళచే ఆకర్షింపబడ్డానికి. అయినా కాకీ (Female family) లో చేరినదానివి కనుక నీకు తెలుస్తుందనుకుంటాను. ఏమంటావ్?

నాశార్థం. నాపిండాకూడు. అంటాను. నే నడిగేదానికి సమాధానం చెప్తానండం మరిచిపోయేరన్నమాట. ఇంతకీ నేనడిగేదానికి జవాబిస్తారా? యివ్వరా?

ఆడాళ్ళడిగేమాటకి జబాబియ్యకపోతే బ్రతకనిస్తారా? శ్రీకృష్ణుడుని సత్యభామ తన్నినట్టు పళ్ళ్యాకతంతాను దంతాలు కదిలేటట్టు పరెలుమని సిరస్సు వేయివక్కలయ్యేటట్టున్న సమయం కనిపెట్టి అసలు ముక్కేదో అంతర్యంలోనే వుంది. అసలుముక్కనకుండానే ఇంత నాటకం ఆడించేవు మాట్లాడేవంటే ముసుగులో గుద్దులాటలతంతు. నీళ్ళల్లో గేదిని పెట్టి కొమ్ములు చూపించి బేరం చెపితే ఎలాకుదురుతుంది వ్యవహారం? అసలుమాటేదో ఖరాఖండీగా ముఖంమొకుట బ్రద్దలుకొట్టి మాట్లాడాలి.

నేనేదో మాటంటే ఆమాటట్టుకు వీకి పాకం పట్టేవరకూ వదిలిపెట్టేరుగాదు నిండుకుండెప్పుడూ తొణకదు లెండి. అదీకాక మగవారికేవి క్లెండి ఆగ్రహా అనుగ్రహాలంతట్లా కనపడుస్తారు పెళ్ళాల్దగ్గర (మహారాజుల్లా) దర్జాగా...

అధికంగా భట్రాజు పొగడినట్టు పొగడ్డానికి ప్రారంభించేవ్. అంతేగాని అసలుముక్కేదో నీ అంతస్తులోనే అణగిపోయింది. "మత్స్యమాంసం

మతిభ్రష్టు, ఆకాశం కిం ప్రయోజనం అన్నట్టు, ఇవతల నాపనంతా గంగాప్రవేశమయింది.

'Silence is golden" అన్నారు పెద్దలు. నోరు మూసుకూరుకుంటే యింతవరకు రాకపో నేమో ?

నీవు నోరు మూసుకూరుకొంటే యెలాగ ? ఏదో అని నా ప్రాణానికి పీకలాట తెచ్చిపెడు తూ వుండాలిగాని. దీనికేంగాని నీవు చెప్పబోయే దేదో చెప్పాదూ నీకు పుణ్యముంటుంది మహా ప్రభో ప్రాణం విసిగిపోతోంది.

నే చెప్పినమాట విని ఆప్రకారముగా చేస్తా నని promise) చెయ్యండి తరువాత చెపు తాను.

ప్రామిస్ చెయ్యడం అంటే ? ప్రమాణకం చెయ్యమంటావా ? స్నానం చేసి గుళ్లో దీపం ఆర్పి రమ్మంటావా ? యింట్లో యిద్దరిపిల్లల్నె త్తి కొట్టమంటావా ? భారతరామాయణాలు బుర్ర మీద పెట్టుకొని బాసలు చెయ్యమంటావా ? అదేపోయిన నాలుక కాలిస్తే కాల్చేరు, మసీ దగ్గిరకెళ్ళి ఖురానేనా చెర్చిలోకెళ్ళి బైబిలేనా సిరస్సుమీద పెట్టుకొని (అల్లా) యెదటేనా లేక పోతే (యేసుక్రీస్తు) యెదటేనా నా పెళ్ళాంకోరిక నెరవేరుస్తానని వొట్టెట్టుకు రమ్మంటావా ? యి వన్నీ నీకు నచ్చకపోతే 'నిటలాక్షుం డేపు డెత్తి వచ్చినను రానీ మరేమయిన గానీ' అని అర్జును న్ఫా ఘోరమైన ప్రతిజ్ఞ పట్టమంటావా ? ఏం చెయ్యమంటే అచ్చేస్తాను. తప్పుతుందా ? పై పాటల్లో ఏదో వొహటయినా ఆచరణంలో పెట్టకపోతే గర్భశోకంలోకి గుప్పెడు మెతుకు లెళ్ళే యెత్తు లేదు. చెప్పు త్వరితంగా ఏం చెయ్యమంటావో. "delay is dangerous" అ న్నారు పెద్దలు. ఎందుకయినా మంచిదే దిక్కు మాలిన ఖర్మం చెప్పబోయే దేదో చెప్పు త్వరగా.

ఇం కెలాగమ్మా యీయనదగ్గర కాపరం చెయ్యడం ? బ్రతకనిచ్చే పట్టు కనబడదు. ఏ వండీ చెవుతున్నా వినండి. మీకు సమాధానం చెప్పడానికి నా తరం గాదు నన్ను పుట్టించిన బ్రహ్మతరంకూడా గాదు. అయినాకాని కుక్క మొరిగితే జంగం పరపతి పోతుందేమిటి ? అను కోండి మీ యిష్ట మొచ్చినట్టు. నే చెప్పే దే దో చెప్పి అవతలికి చక్కాపోతా. యెందు కొచ్చిన సోదమ్మా యిది ?

ఎవరేనా తుమ్ముతున్నారేమో వుండు చెపు దుగాని. వర్జం వుందేమో ? తిథివారనక్షత్రాలు మంచి వవునో కావో ? మంచివి కాకపోతే శెలి సి కొడుతుందికూడాను. 'మూచ్చూస్తే విషం పోతుంది, ముండని చూస్తే దుఃఖం పోతుం' దన్నట్టు పంచాంగం చూస్తే అనుమానమేనా వదిలి పోతుందేమో ?

'చిట్టిని' 'జీ' కిచ్చి పెళ్ళిచేద్దామనుంది. ఏ మంటారు చెప్పండి.

అయ్యో ! అయ్యో ! చెప్పావా ? అప్పుడే చెప్పేసేవేం ? ప్రణయకలహమయినా ప్రారంభం అవకుండా. యింకాస్సేపూరుకో లేకపోయావా ! యీమాత్రం మాట చెప్పడానికి బ్రహ్మరుద్రేం ద్రాదుల్ని భూంబిమ్మడికి రప్పించే వన్నమాట. అయినాకానీ 'పిచ్చి కుదిరింది రోకలి తలకి చుట్ట' మన్నట్టు వాడికేదో గతిలేక మనింట్లో పని ఏడుస్తుంటే వాడి కిచ్చి పెళ్లి చెయ్యమం టావు గదా. అసలు నీ వుద్దేశ మేమిటి ?

నావుద్దేశాని కేవుంది ? బి. ఏ. చదువుతున్నా డని వాడి గొప్ప వుద్యోగం వస్తుందని మన కుర్రాడు ఉబ్బిపోతున్నాడు.

261

ందు కా పొంగడం బోర్లపడ్డానికి కాక పోతే. నిన్న గాక మొన్న కళ్ళు తెరచిన చవటమ్మ వాడికేం తెలుసు? (pride goes before a fall) అన్నట్టు పాడయిపోయేముందు పుట్టె పాడుబుద్ధు లివే. బిచ్యే చదువుతున్నాడు గదా అని పిల్ల నిస్తే 'వృథయద్భ్రష్టత్వం వుపరిసన్యాసం' అన్నట్టు ఏ కిరీస్టిన్‌దాన్నో తీసుకు చక్కాపోతాడు. 'కన్ను మెల్లోయి గృడ్డు బ్రౌరడిం' దన్నట్టు వీడు చేసిన పాపానికి ప్రాయశ్చిత్తం చేయుంచలేక నా ప్రాణాలు రెండూ పెడదారి పడతాయి. నలుగురులోను బుర్రెత్తుకోవడానికైనా వీలుండదు.

కుర్రాడు చక్కని చుక్కలా వుంటాడండీ. వాణ్ణి చూస్తె నాకు ముద్దేసుకొస్తుంది. బుద్ధిమంతుడు కూడాను.

బుద్ధి బుగ్గయినట్టుగానే వుంది. నీదంతా అదోమతం. కత్తికుక్కని గంగిగోవు చేస్తానంటావు. పైకందంగానే వుంటాడు మనకొంప తియ్యడానికి. మేడిపండులాంటి మహానుభావు లెంతమంది లేరు. అందులో ఈమహానుభావుడో (Member) అయి వుండకూడదూ. ఏపుట్టలో ఏపామువుందో ఎవరికి తెలుస్తుంది. పెచ్చిన కుక్కే కాలు కరచిం దన్నా తంతొస్తుంది. అప్పుడు విచారిస్తేమాత్రం లాభ మేమిటి. దీనికేంగాని ఈపురాణంలో తొమ్మిదో అష్టకం నువ్వు చదవడం నే అర్థం చెప్పడం ఎప్పుడూ వుంది కాని కడుపులో మాడి పోతోంది అన్నం పెట్టు 'జీ'. పెళ్లిగురించి బెంగ పెట్టుకుని మనోవ్యాధి తెచ్చిపెట్టుకోకు. నా మాట విను. మనోవ్యాధికి మందు లేదుకూడాను. డాక్టర్ను కాదుగదా సర్జన్సు వొచ్చినా చల్లార్చడం కష్టం. ఇప్పటికే పదిన్నరయింది. ఇన్ని మెతుకులు పడెయ్యకపోతే ప్రాణాలు కంఠగతానికి వస్తాయ్.

నాకు సరియైన సమాధానం చెప్పడానికి వోపిక లేదు గాని యింతచరువు చదవడానికి వోపిక వచ్చింది కాబోసు. భోజనానికే లేవండి పాపం మీకెంత ఆకలేస్తోందో. అంటూ చరచర చక్కాపోయింది మాఆవిడ వంటింట్లోకి (రైల్వే కార్లా). ఆడదాని కేంతెలుసును చెప్పండి. (There is no end for wants) అన్నట్టు యీవేళ పెళ్లిచెయ్యమంటుంది. తరవాత పిల్లమీద ప్రేమచేత వాడికి లేకపోవడంచేత నాలుగెకరాల భూమి రాసిమ్మంటుంది ఆడంగు లూహాలికి అంతేమిటి తృప్తేమిటి.

మా ఆవిడ పట్టి పెంకిపిండం అంటే నమ్మండి. మా అమ్మాయి పెళ్ళివిషయమై ఎంతైనా పీకులాట తెచ్చిపెట్టింది నాప్రాణానికి డబ్బులేని దరిద్రుడికి 'జీ' కిచ్చి పెళ్ళి చెయ్యమంటుంది. "సర్వేంద్రియాణాం నయనం ప్రధానం" అన్నట్టు అవయవాల్లోకి కళ్లెంతముఖ్యమో ప్రపంచకంలో అన్నిటికంటె ధన మంత ముఖ్యము కదా. ఇందుచేతనే 'ధనమూలమిదం జగ' త్తన్నారు పెద్దలు. ఈ సనాతనధర్మవాక్యతాత్పర్యం ఎలాగా మరిచిపోవడం? మరిచిపోదామన్నా మరుపుకొస్తుందా. 'ధనమే ప్రపంచలీలా' అంటూ శంఖర్రావుగారు రంగూన్‌రాడియో (స్టేజిమీద) అడియన్సుతో. ఎంత అనుభవముండకపోతే వారలా సెలవిస్తారు. మాశర్మకి ఈ వుపగ్రహం జీకి చదు వెలా చెప్పించగలిగేను. ధన ముండబట్టే గదా. అనిఆలోచిస్తూ విస్తరదగ్గర కూర్చున్నా విస్తట్లోవున్న పదార్థాలు చూసేసరికే నా ఆకలి హరించుకుపోయింది. మనుగుడుపు పెళ్ళికొడుక్కి చేసే మర్యాదంతా నా కా విస్తరదగ్గిర కనుపించింది. ఎప్పుడూ మా యింటావిడకి అంత భారీ

చెయ్యవడం ఎరగ. ఇంతకీ ఆవేళ మా అమ్మాయి పుట్టినరోజులెండి. నూరేళ్ళకీ పంద్రాండేళ్ళొచ్చాయట మా ఆవిడ నాతో చెప్పిందిలెండి. తల్లి సంవత్సరం ఓటి మినహాయించిందిలెండి అందుచేతనే నవరుచులు పంచభక్ష్యపరమాన్నాలు రుచూచ్చానే యోగం పట్టింది. మా యింటావిడ నా కప్పుడుచేసిన సౌకర్యాన్నిపట్టి అప్పటిమట్టుకు పురుషామృగంలా పోల్చా. స్త్రీ అంటే శక్తిస్వరూపం అనే ఆర్యోక్తి జ్ఞప్తికి వచ్చింది. "కష్టభరితంబు, బహుళదుఃఖప్రదంబు" అనే పద్యాన్ని మాంసు రాగంతో శుద్ధ మనస్సుకు నప్పజెప్పా. సంతోషం అనేదాన్ని కళ్ళల్లో మిళావుచేసి మా ఆవిడ ముఖంమీదికి ప్రసరింపజేసా విద్యుచ్ఛక్తి యంత్రంలో వెలుతురులా. నే ఎప్పుడైతే కాస్త సంతోషంగా కనుపించేనో అప్పుడే మొదలెట్టింది నాతో (కరస్పాండెన్సు)

ఏమండీ! నేనడిగినదానికి సమాధానం చెప్పరూ?

"రెడ్డొచ్చె మొదలాడ" మన్నట్టు మొదలెట్టేవు చేగల్నాటిభాగవతం మళ్ళా. సరే బాగానే వుంది నీ వ్యవహారం అన్నా.-

"కాకేరాజులు రాజ్యముల్ గల్గవే గర్వోన్నతిన్ జెందరే" అన్నది "కూలి నాలి నాలి యులేక" అన్నా పద్యం వొకటి యిల్లాంటిపద్యాలింకా మెన్నో నప్పజెప్పింది. ఒకసారి వేదాంతోపన్యాసం వర్ణించింది. ఇంతకీ యింట్లో గ్రామపోనుండడం గొప్ప ముప్పు తెచ్చిపెట్టిందనుకున్నాను. "A bird in the hand is worth two in the bush" అన్నట్లు యింట్లో చక్కని కుర్రాడుంటే వాడికిచ్చి పెళ్ళిచెయ్యక, ఇంకోప శుతుల్యుడికిచ్చి పెళ్ళిచేస్తానంటా రిదేంపాపమండీ అయినా కానీ ఆ వచ్చేఅల్లుడు మంచివాడు నమ్మకమైనవాడు అవుతాడులావుంది. కానియ్యండి ఇంకోసంబంధం చేస్తే కోర్కాంగు పీక్కురవుతుంది లేదా నుయ్యో గొయ్యో చూసుకుంటాను. పిల్లలిగతి అధోగతి పాలవుతుంది బాగా వింటున్నారా అంది. ఊ, అంటూ చెయ్యకడుక్కుని వీధిలోకి వెళ్ళా.........

కాలచక్రం గిర్రుమని తిరిగొచ్చింది. 'చిట్టి'కి పెళ్ళి కుదిరింది. ముహూర్తంటయిము సమీపించింది. పెళ్లికూతుర్నీ పెళ్లికొడుకునీ పీటలమీద కూర్చోపెట్టేరు బాండువాయిస్తున్నారు. పెళ్లికొడుకు బంధువులలో ఓ ముసలమ్మ నూతిలో కురికింది. ఎందుచేతనంటే ఆ అవ్వ మనవరాలుకు పెళ్లికొడుక్కు మేనరికంవుండట. తనమనవరాలిని పెళ్ళిజేసుకున్నాడు గాదనిట. పెళ్ళికొడుకుతోసయితంగా నూద్దగరికి పరిగెట్టేం. ఈలోపున మా ఆవిడ ఆబ్రహ్మగారికి ఓపదిరూపాయలిచ్చి 'జ' చేత 'చిట్టి' మెళ్ళో మంగళసూత్రం కట్టించి ఆఖరికి పెళ్లి అయిందనిపించింది. అందరం అది జూసి ఆశ్చర్యపోయాం. మా ఆవిడ భల్లూకప్పట్టు నెరవేరింది. అందరిముఖాలిమీద (Dim) అనేది ప్రత్యక్షమయింది. "ధిక్కారమును సైతునా శీఘ్రీ తులువ" నాపెళ్ళాంమీద రంకెలేస్తే కళ్లుమూసుకుని ముసలమ్మచేసినపని చేస్తుందని మాట్లాడకూరకున్నా.

మేడిద బాపిరాజు.